**Eenadu**

# ఆ కొలువుల భర్తీ మరిచారా?

- అనుమతి ఇచ్చి ఏడాదైనా కదలిక లేని ౨౦౦ పోస్టులు
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖదే జాప్యం

**ఈనాడు, హైదరాబాద్:** కొత్త రాష్ట్రంలో కొలువులు పొందవచ్చని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కోసం.. తెలంగాణ ప్రభుత్వం గతేడాది జులైలో 15వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి అనుమతిచ్చింది. వాటిలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలోని పోస్టులూ ఉన్నాయి. సాంకేతికమైనవి కాక.. సాధారణ ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హతలతో భర్తీచేసే పోస్టులు 200కు పైగా ఉన్నాయి. వీటిని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా నింపాలంటూ ఆదేశాలు వచ్చాయి. ఇది జరిగి ఏడాది దాటింది. ఆనాడు ప్రభుత్వం అనుమతిచ్చిన పోస్టులన్నింటి భర్తీ ప్రక్రియ పూర్తయింది కానీ.. ఈ పోస్టులు మాత్రం ఇంకా అలాగే మిగిలి ఉన్నాయి. కారణం- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరంగా జరుగుతోన్న జాప్యమని తెలుస్తోంది.

**సమాచారం పంపటంలోనే....** గత ఏడాది జులై 27న ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీకి అనుమతిచ్చిన అనేక పోస్టుల్లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలోని హెల్త్ అసిస్టెంట్స్ (మున్సిపాలిటీల్లో) 50 పోస్టులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్-35, బిల్‌కలెక్టర్లు (జీహెచ్‌ఎంసీ)-124 ఉద్యోగాలున్నాయి. వీటికి సంబంధించిన సేవా నిబంధనలు(సర్వీస్‌రూల్స్), రోస్టర్ వివరాలను టీఎస్‌పీఎస్సీకి పురపాలక శాఖ గతంలో పంపించింది. అయితే.. వాటికి పేర్కొన్న అర్హతలు తదనుగుణంగా లేకపోవటంతో వాటిని టీఎస్‌పీఎస్సీ పురపాలక శాఖ పునఃపరిశీలనకు పంపినట్లు సమాచారం. అక్కడి నుంచి ఆ పోస్టుల భర్తీ ఆలస్యమవుతూ వస్తోంది. ఇటీవలే హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అర్హత విషయంలో స్పష్టత వచ్చినా... జోనల్, మల్టీజోనల్ అంశంలో ఇంకా గందరగోళం తేలలేదని తెలిసింది. హెల్త్ అసిస్టెంట్లకు ఇంటర్మీడియట్ బైపీసీ ఉత్తీర్ణులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు బీఎస్సీ బీజెడ్‌సీ కనీస ఉత్తీర్ణతగా నిర్ణయించారు. కానీ 'జోనల్' విషయంలో పురపాలక శాఖ నుంచి స్పష్టత వస్తే కానీ, వీటి భర్తీ ముందుకు కదిలే పరిస్థితి లేదు. ఇక పెద్దసంఖ్యలో ఉన్న బిల్‌కలెక్టర్ల పోస్టుల గురించిన ఊసే లేదు. గత సమాచారం ప్రకారం పదోతరగతి అర్హతతో వీటిని భర్తీ చేయాలనుకున్నా తర్వాత ఈ పోస్టుల స్థాయి పెంచాలనే ఉద్దేశంతో ఉన్నట్లు చెబుతున్నారు. మొత్తానికి పురపాలక శాఖ ఏ విషయం స్పష్టంగా చెప్పకపోవటంతో 200కుపైగా పోస్టులు ఏడాది దాటినా భర్తీకి నోచుకోకుండా నానుతున్నాయి. గతంలో కూడా ఇంజినీరింగ్ విభాగంలో సివిల్, మెకానికల్ పోస్టుల విషయంలోనూ పురపాలక శాఖ అస్పష్టంగా వ్యవహరించటంతో గందరగోళం తలెత్తింది.